# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-05-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించినందుకు సాయుధ దళాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంసించారు.
2. దేశానికే ఆదర్శంగా నిలిచేలా ఆంధ్రప్రదేశ్ రక్షణ-అంతరిక్ష విధానాలకు రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
3. భారత సైన్యానికి సంఘీభావంగా నిర్వహించే ర్యాలీలో తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈరోజు పాల్గొంటారు.
4. సంక్షేమ పాఠశాలల్ని కార్పొరేట్ పాఠశాలలకు సమానంగా తీర్చిదిద్దుతామని ఆంధ్రప్రదేశ్ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు.
5. టిజిఎస్ఆర్టీసీని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం నిన్న ఢిల్లీలో సమావేశమయ్యింది. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించినందుకు సాయుధ దళాలను ప్రధానమంత్రి ప్రశంసించారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి నరేంద్రమోదీ మంత్రివర్గానికి వివరించారు. ఈ సమావేశంలో జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ విద్యుత్ రంగానికి బొగ్గు కేటాయింపుల విధానం, శక్తి పథకం పునరుద్ధరణకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. విద్యుత్ ఉత్పత్తిదారుల థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు బొగ్గు కేటాయింపులను మంజూరు చేయడానికి సైతం ఆమోదం లభించిందని ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఇదిలా ఉండగా కేంద్ర ప్రభుత్వం ఈ ఉదయం 11 గంటలకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఆయా రాజకీయ పార్టీలకు ఆపరేషన్ సిందూర్ గురించి వివరించనుంది.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ను దేశానికే ఆదర్శంగా నిలిపేలా రక్షణ-అంతరిక్ష విధానాలకు రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర చివాలయంలో ప్రభుత్వ సలహాదారులు సతీశ్‌రెడ్డి, సోమనాథ్‌లతో ఆయన నిన్న సమావేశమయ్యారు. ఈ రెండు రంగాలకు సంబంధించి రాష్ట్రానికి వచ్చే ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు పొందేలా కీలక పాత్ర

పోషించాలని ముఖ్యమంత్రి వారికి సూచించారు. విద్యార్థులు ఆయా రంగాల వైపు ఆకర్షితులయ్యేలా ఒక వ్యవస్థను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని కీలక ప్రాంతాల్లో రక్షణ, అంతరిక్ష కేంద్రాల ఏర్పాటు దిశగా  చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

-----------------------------

'ఆపరేషన్ సిందూర్ పట్ల ప్రతి భారతీయుడు గర్వపడుతున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.  'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయన నిన్న ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "హైదరాబాద్ పరిధిలో ఉన్న రక్షణ  కార్యాలయాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కాగా  భారత సైన్యానికి సంఘీభావంగా ఈ రోజు  సాయంత్రం 6 గంటలకు ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. సైన్యానికి మద్దతుగా ఈ ర్యాలీలో యువత పెద్దఎత్తున పాల్గొనాలని  ముఖ్యమంత్రి  పిలుపునిచ్చారు.

-----------------------------

పాకిస్తాన్ ఉగ్రవాదానికి 'ఆపరేషన్ సిందూర్'తో భారత ప్రభుత్వం సరైన సమాధానం చెప్పిందని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులో ఆపరేషన్ సిందూర్ పై ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడారు. దేశ రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయానికి మద్దతు ఇస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలియచేస్తూ..

వాయిస్ ..22  సెకన్లు

-----------------------------

ఆపరేషన్ అభ్యాస్ పేరుతో విశాఖ పట్నం పాత పోస్ట్‌ఆఫీస్ కూడలిలో పౌర రక్షణ మాక్‌డ్రిల్ ను గత సాయంత్రం నిర్వహించారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వ్యవహరించాల్సిన విధానంపై అధికారులు ఈ సందర్భంగా  ప్రజలకు తెలియజేశారు. మాక్ డ్రిల్ భాగంగా  భవనాల నుంచి ప్రజలను బయటకు తీసుకొచ్చే ప్రక్రియపై అవగాహన కల్పించామని అగ్నిమాపక శాఖ అధికారి తెలియజేస్తూ,

వాయిస్..  31 సెకన్లు

మరోవైపు హైదరాబాద్‌లో నిన్న నిర్వహించిన పౌర రక్షణ మాక్ డ్రిల్ విజయవంతంగా ముగిసింది. ఈ మాక్ డ్రిల్‌లో వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించాల్సిన విధానంపై అవగాహన కల్పించారు.  యుద్ధం అనివార్యమైతే పౌరులు పాటించాల్సిన నియమాలను విపత్తు నిర్వహణ దళాల సిబ్బంది వివరించారు. నగరంలోని నానల్‌నగర్, కంచన్‌బాగ్, సికింద్రాబాద్, ఈసీఐఎల్ ఎన్ఎఫ్‌సీ  ప్రాంతాల నుంచి కొనసాగిన ఈ రక్షణ విన్యాసాలను  కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఉన్నతాధికారులు పర్యవేక్షించారు.

-----------------------------

సాంఘిక, గిరిజన సంక్షేమ పాఠశాలల్ని కార్పొరేట్ పాఠశాలలకు సమానంగా తీర్చిదిద్దుతామని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గిరిజనశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో కలిసి ప్రతిభా పురస్కారాలను గత సాయంత్రం అందజేశారు. కష్టపడితే ఎవరైనా

ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని  ఈ సందర్భంగా మంత్రి పేర్కొంటూ,

వాయిస్ .. 33 సెకన్లు

----------------------------

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ టిజిఎస్‌ఆర్టీసీని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని  రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సిద్దిపేట జిల్లా దుద్దెడ టోల్ గేట్ నుంచి సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం వరకు నిన్న మంత్రి ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. ఈ మేరకు బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు, విద్యార్థులు, కండక్టర్‌తో  మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళల ఉచిత ప్రయాణంపై అమలు వివరాలను  తెలుసుకున్నారు.

----------------------------

దేశ రక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతనిస్తోందని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు.  పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో కేంద్రమంత్రి నిన్న  పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ .. 28 సెకన్లు

----------------------------

సంస్థాగతంగా పార్టీ నిర్మాణంపై దృష్టి సారించాలని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులకు ఆ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులతో నిన్న ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయిలో ఉన్న బూత్ కమిటీల వరకూ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేలా కృషి చేయాలని సూచించారు.

----------------------------

ఈరోజు ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. వరదలు, భూకంపాలు, ఇతర, ప్రకృతి వైపరీత్యాలకు గురైన ప్రజలకు సహాయం అందజేయడం, వారి ప్రాణాలను కాపాడడానికి రెడ్ క్రాస్ సంస్థలు చేస్తున్న కృషిని గుర్తించడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. 1948వ సంవత్సరం నుండి ప్రతి ఏటా మే 8వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. మొదటి నోబెల్ శాంతి పురస్కార గ్రహీత, రెడ్ క్రాస్ సంస్థను ప్రారంభించిన జీన్‌హెన్రీ డ్యూనాంట్  స్విట్జర్ లాండ్‌లోని జెనీవా నగరంలో 1828 మే 8వ తేదీన జన్మించిన సందర్భాన్ని పురస్కరించుకుని... ఆయన జ్ఞాపకార్థం ప్రతి ఏటా మే 8వ తేదీన ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

=====================